


పూడికతీత.. ఏదీ నాణ్యత ?
గోదావరి కాల్వ పూడిక తీత పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో తమకు సాగునీటి కష్టాలు తప్పవేమోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో ▸



ఆక్వా ఉక్కిరిబిక్కిరి
గత నెల రోజులుగా వాతావరణంలో విపరీత మార్పులతో ఆక్వా ఉక్కిరిబిక్కిరవుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలతో ఆక్సిజన్ శాతాల్లో మార్పులు తలెత్తుతున్నాయి. 8లో ▸



ముగిసిన కల్యాణోత్సవాలు
ఈడూరులో శ్రీవరాల వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు శ్రీపుష్పయాగోత్సవంతో బుధవారం ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 8లో ▸

తొలి ఏడాది సూపర్ ఫ్లాప్

కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. 2024 జూన్ నుంచే పథకాలను అమల్లోకి తెస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి నేతలు తర్వాత ఆ ఊసే మరిచారు. సూపర్ సిక్స్ హామీలను పట్టాలెక్కించకుండానే సంవత్సర కాలాన్ని గడిపేశారు. సంక్షేమ ఫలాల కోసం ఎదురుచూసిన ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు.

- అమలుకు నోచుకోని సూపర్‌సిక్స్ హామీలు
- పింఛన్ పెంపు, సింగిల్ సిలెండర్‌తో ఏడాది పూర్తి
- ప్రజల నుంచి నిరసన సెగ
- హామీల అమలుపై ఉండిలో మంత్రి లోకేష్‌ను ప్రశ్నించిన స్థానికులు
- సోషల్ మీడియా వేదికగా సర్కారును తప్పుపడుతున్న నెటిజన్లు



సాక్షి, భీమవరం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 5న నరసాపురం, పాలకొల్లు, ఏప్రిల్ 10న తణుకు, ఏప్రిల్ 21న నరసాపురం, భీమవరం, ఏప్రిల్ 29న తాడేపల్లిగూడెం, మేన 10న ఉండి బహిరంగ సభల్లో పాల్గొన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ సూపర్ సిక్స్‌పై హామీలిచ్చారు. తల్లికి వందనం కింద ఏటా చదువుకునే ప్రతి ఒక్క బిడ్డకు రూ.15,000 చొప్పున ఇస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలొచ్చే వరకు నెలకు రూ.3,000 భృతి అందజేస్తామన్నారు. ఆడబిడ్డల కోసం మహాశక్తి కార్యక్రమాన్ని తెచ్చి 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు ప్రతి మహిళకు నెలకు రూ.1,500 నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామని చెప్పారు. అన్నదాతకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ. 20,000 చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

సర్వేలతో సరి:
ఎన్నికల హామీలను గాలికొదిలేసి సర్వేలతో కాలం గడిపేసింది. తొలి ఏడాది తల్లికి వందనం, నిరుద్యోగభృతి, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి తదితర పథకాల జాడలేదు. పింఛన్ సాయాన్ని రూ.వెయ్యి పెంచిన ప్రభుత్వం, కొత్త పింఛన్ల మంజూరు నిలిపివేసింది. 11 నెలల తర్వాత స్పౌజ్ పింఛన్ల మంజూరును ప్రారంభించింది. నవంబరు నుంచి మృతిచెందిన వారి భార్యలకు మాత్రమే పింఛన్ సాయాన్ని వర్తింపజేస్తోంది. గత ఏడాది జూన్ నాటికి జిల్లాలో 2,32,885 పింఛన్లు ఉండగా వారికి రూ.99.80 కోట్లు సాయంగా అందించారు. ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య 2,25,718కు చేరగా ఆ మేరకు ప్రభుత్వ సాయం రూ.96.87 కోట్లకు తగ్గింది.

ఏడాదికి మూడు సిలెండర్లని చెప్పిన ప్రభుత్వం మొదటి ఆర్థిక సంవత్సరం ఒక్క సిలెండర్‌కే పరిమితం చేసింది. జిల్లాలో 6.21 లక్షల గ్యాస్ కనెక్షన్లకు నవంబరు నుంచి మార్చి 31వ తేదీ నాటికి 4.42 లక్షల మందికి సింగిల్ సిలెండర్ లబ్ధి చేకూరింది. ఈ ఆర్థిక సంవత్సరానికి బుధవారం నాటికి 4.62 సిలెండర్ల బుకింగ్స్ జరగ్గా ఇంతవరకు 1.67 లక్షల మందికి మాత్రమే దీపం పథకం లబ్ధి చేకూరింది.

సూపర్ సిక్స్ పథకాల అమలులో పాలకుల వైఫల్యాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రజలు తూర్పారబడుతున్నారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు కూటమి నాయకులు చేసిన విన్యాసాలకు సంబంధించిన వీడియోలకు తమ సృజనాత్మకను జోడిస్తున్నారు. కొన్నింటికి సినీ సన్నివేశాలను జతచేస్తున్నారు. కొన్ని సినిమాల్లోని హాస్య సన్నివేశాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి రామానాయుడు, ఇతర నాయకులు చెప్పిన మాటలను వాయిస్ ఓవర్ జతచేసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ ఏడాది కాలంలోని పలు సందర్భాల్లో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఎక్కడ చూసిన సూపర్‌సిక్స్‌పై రీల్స్ ట్రెండింగ్‌లో ఉన్నాయి.

నిరసనల సెగ

2024 జూన్ నుంచే అమల్లోకి వచ్చే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరేది వివరిస్తూ కూటమి నేతలు కరపత్రాలు పంచిన విషయం విదితమే. సంక్షేమ పథకాల అమలులేకపోగా ఫీజుల బకాయిలు విడుదల చేయకపోవడం, విద్యుత్ చార్జీలు పెంచడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం తదితర రూపాల్లో ప్రజలపై భారం పెరిగింది. మార్కెట్‌లో మనీ రొటేషన్ ఆగిపోవడంతో వ్యాపారాలు తగ్గిపోయాయి. సూపర్‌సిక్స్ పథకాలు అమల్లోకి రాకపోవడంపై మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తదితర వర్గాల్లో అసంతృప్తి ఉంది. ఈ ఏడాది జనవరి ప్రారంభంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఉండి పర్యటనకు రాగా ఎన్నికల్లో చెప్పినట్టుగా 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలనెలా రూ. 1500, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం ఎప్పటి నుంచి అమలుచేస్తారు సారూ?.. అంటూ స్థానికులు ప్రశ్నల వర్షం కురిపించారు.


ఉండిలో సూపర్ సిక్స్‌పై లోకేష్‌ను ప్రశ్నిస్తున్న స్థానిక మహిళలు (ఫైల్)

మహిళల్ని దగా చేశారు



తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెప్పారు. తొలి ఏడాది వాటి ఊసెత్తకుండా కూటమి ప్రభుత్వం మహిళల్ని దగా చేసింది.

– పి.వెంకటలక్ష్మి, గృహిణి, తణుకు

సాయానికి ఎగనామం



ఏటా పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇస్తామని ప్రకటించి మొదటి ఏడాది సాయానికి కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టింది. ఉచిత పంటల బీమా పథకానికి ఎసరు పెట్టి ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది.

– పి.నరసింహస్వామి, రైతు, గొల్లవానితిప్ప

గత ప్రభుత్వంలో తొలి ఏడాదే నవరత్నాలు

2019 సీఎంగా బాధ్యతలు చేపట్టిన మొదటి నెల నుంచే నవరత్నాల అమలుకు అడుగులు వేశారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల్ని ఏర్పాటుచేసి తల్లికి వందనం, రైతు భరోసా, ఉచిత పంటల బీమా, వైఎస్సార్ ఆసరా, పింఛన్ సాయం పెంపు, ఇంటింటికే పింఛన్ల పంపిణీ తదితర పథకాల అమలుకు శ్రీకారం చుట్టారు. కులమత వర్గాలకు అతీతంగా, రాజకీయాలు చేయకుండా అర్హులైన వారందరికి సంక్షేమ లబ్ధిని నేరుగా వారి గడప చెంతకు చేర్చారు. పథకాల అమలులో దళారులు, మధ్యవర్తుల బెడద లేకుండా పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేశారు మాజీ సీఎం జగన్

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ కో-ఆర్డినేటర్‌గా వెంకటరాయుడు



సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నేత చినమిల్లి వెంకటరాయుడు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. భీమవరం రూరల్ రాయలంకు చెందిన వెంకటరాయుడు గతంలో గ్రామ సర్పంచ్‌గా, రూరల్ జెడ్పీటీసీగా, పార్టీ సేవాదళ్ విభాగం రీజనల్ కోఆర్డినేటర్‌గా, కాపు నాడు జిల్లా అధ్యక్షుడిగా అనేక పదవులు నిర్వర్తించారు.

స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలి


జిల్లా రవాణా శాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భీమవరం: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న విద్యాసంస్థల బస్సుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బుధవారం భీమవరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రవాణ శాఖ నిబంధనలను ఉల్లంఘించి విద్యాసంస్థల్లో బస్సులు, వ్యాన్లు నడుపుతున్నారన్నారు. ఫిటనెస్ లేని వాహనాల్లో ఎక్కువ మందిని తరలిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు.

డీఎస్సీ పరీక్షలకు 19 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షకు 19 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. ఉదయం పరీక్షకు 95 మందికి 91 మంది హాజరుకాగా మధ్యాహ్నం పరీక్షకు 165 మందికి 150 మంది హాజరయ్యారని ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం


కైకలూరు టౌన్‌హాలులో వర్షానికి చేరిన నీరు

కైకలూరు: అకాల వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏలూరు జిల్లాలోనే అత్యధిక వర్షపాతం కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లిలో 193.6గా బుధవారం నమోదైంది. మండవల్లి మండలంలో 96.4, కైకలూరు మండలంలో 75.2, కలిదిండి మండలంలో 38.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కైకలూరులో పలు డ్రెయిన్లలో నీరు పొంగి రహదారులపైకి చేరాయి. వెలంపేటలో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. కైకలూరు టౌన్‌హాల్‌లో చేరిన నీటితో ఆ ప్రాంతం బురదగా మారింది.

జూలై 31 వరకూ స్కూల్ ఫీజు చెల్లింపునకు అవకాశం

భీమవరం: సార్వత్రిక విద్యాపీఠం ద్వారా టెన్త్, ఇంటర్ ప్రవేశాల కోసం ఫీజు చెల్లించడానికి జూలై 31 వరకు సమయం ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి ఫీజు చెల్లించవచ్చన్నారు. అపరాధ రుసుం రూ.200 చెల్లించి ఆగస్టు 15 వరకు గడువు ఉంటుందని చెప్పారు.

విద్యుత్ అధికారుల బదిలీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు, పశ్చిమ గోదావరి సర్కిళ్ల పరిధిలో పలువురు అధికారులను బదిలీ చేశారు. జిల్లా స్టోర్స్‌లో ఏఈఈ అవుట్ డోర్‌గా పని చేస్తున్న మురళీకృష్ణను జంగారెడ్డిగూడెం ఆపరేషన్స్ ఏఈఈగా బదిలీ చేశారు. పెదవేగి డిప్యూటీ ఈఈ ఆపరేషన్స్‌గా పని చేస్తున్న బీవీ కృష్ణ రాజాను రాజోలు ఆపరేషన్స్ డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ ఈఈగా పని చేస్తున్న ఐవీ మల్లేశ్వరరావును పెదవేగి, రంపచోడవరం రూరల్ ఆపరేషన్స్ డిప్యూటీ ఈఈ దివాకరరావును తణుకు బదిలీ చేశారు.

సురక్షిత తాగునీరు అందించాలి


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): సురక్షిత తాగునీరు అందించేందుకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి తాగునీరు, పన్ను వసూళ్లు, శానిటేషన్, అనుమతులు లేని లేఅవుట్లలో నిర్మాణాలు, తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలువలకు నీరు విడుదల చేసిన నేపథ్యంలో మంచినీటి చెరువులలో నీరు నింపుకొని సురక్షిత తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలన్నారు. ట్యాంకులు, పైప్ లైన్ లీకేజీల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. అనుమతులు లేకుండా అనధికార లేఅవుట్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నారని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం చౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండి చదువుకునేలా కృషి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ర్యాలీలో కార్మిక, సాంఘిక సంక్షేమ, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు తనిఖీ చేయాలి
బాలల సంరక్షణ కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. క్యాంపు కార్యాలయంలో బాలల సంరక్షణ కేంద్రాల జిల్లా స్థాయి సిఫార్సుల కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. కమిటీ చైర్‌పర్సన్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో చాలామంది తల్లిదండ్రులు గల్ఫ్ దేశాలకు వెళ్లడం వలన వారి పిల్లల సంరక్షణ బాధ్యతల విషయంలో చాలా సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనికి సంబంధించి బాలల సంరక్షణ కోసం ఒక లేఖను ప్రభుత్వానికి పంపించడానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

సాక్షి కార్యాలయంపై దాడి హేయం


ఆడమిల్లిలో నిరసన తెలుపుతున్న చింతలపూడి వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కంభం విజయరాజు తదితరులు

కామవరపుకోట/నిడమర్రు/ఉంగుటూరు: పత్రికల్లో వార్తలు ప్రచురించారనే అక్కసుతో సాక్షి పత్రిక కార్యాలయాలపై దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై టీడీపీ మూకలు చేసిన దాడిని ఖండిస్తూ బుధవారం మండలంలో ఆడమిల్లిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పత్రికల స్వేచ్ఛను హరించే ఇలాంటి పనులు ప్రజాస్వామ్యంలో సరైనవి కావని, దుశ్చర్యలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. సాక్షి కార్యాలయంపై టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడిని ఖండిస్తూ నిడమర్రు పోలీస్ స్టేషన్‌లో బుధవారం పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై వీరప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించేలా ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడులు చేసి ఫర్నిచర్ తగల బెడుతున్నా పోలీసులకు పట్టదా? అని ప్రశ్నించారు. మీడియాను బెదిరించి దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వైఎస్సార్‌సీపీ పార్టీ బూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి యెలిశెట్టి పాపారావు బాబ్జి అన్నారు. బుధవారం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో కలిసి దాడులపై ఫిర్యాదు చేశారు. మీడియా వ్యవస్థపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని, దీన్ని ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు.

పత్రికా కార్యాలయాలపై దాడులు సరికాదు
ఏలూరు(ఆర్ఆర్‌పేట): ఏలూరులో సాక్షి కార్యాలయం వద్ద ఫర్నిచర్‌ను తగలబెట్టిన ఘటన దురదృష్టకరమని, పత్రికా కార్యాలయంపై దాడులను పూర్తిగా ఖండిస్తున్నామని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడడం, కార్యాలయాలపై దాడులకు పూనుకోవడం హేయమైన చర్యలని అన్నారు. ఇలాంటి సంఘటనలు తిరిగి జరగకుండా ఉండేలా పోలీస్ అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు సమస్యల స్వాగతం

- నాడు-నేడుకు గ్రహణం
- ఏడాది కాలంగా పూర్తికాని స్కూల్ భవనాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు


భీమవరం పట్టణంలో అసంపూర్తిగా నిలిచిన జేఎల్‌బీ స్కూల్ అదనపు భవన నిర్మాణం

భీమవరం: వేసవి సెలవుల అనంతరం నూతన విద్యాసంవత్సరం గురువారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో సుమారు 1,430 పాఠశాలలు ఉండగా వాటిలో దాదాపు 96 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ స్కూళ్లను సైతం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా సౌకర్యాలు కల్పించారు. దీనితో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన యూనిఫాం, పుస్తకాలు, షూస్, సాక్స్, బెల్ట్, టై, బ్యాగ్‌లతో సంతోషంగా స్కూల్‌కు వెళ్లి ఆనందంగా తిరిగొచ్చేవారు. స్కూళ్లలో పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యబోధన సాగింది. అప్పట్లో మనబడి నాడు-నేడు పథకం ద్వారా జిల్లాల్లోని దాదాపు 750 స్కూళ్లను అభివృద్ధికి చేయడానికి సుమారు రూ.257 కోట్లు మంజూరు చేయడంతో దాదాపు పాఠశాలలన్నీ సుందరంగా తయారయ్యాయి.

నిలిచిపోయిన నాడు-నేడు పనులు
గతంలో ప్రైవేటు స్కూళ్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ స్కూళ్లను అంతగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పూర్వపు పరిస్థితి పునరావృతమవుతోంది. జగన్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన స్కూళ్ల అభివృద్ధి పనులు చివరి దశకు వచ్చినా గత ఏడాది కాలంగా వాటిని పట్టించుకోలేదు. జిల్లాలో దాదాపు 30 స్కూళ్లలో పనులు నిలిచిపోయాయి. నాడు-నేడు పథకాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేయడంతో మిలిగిన పనులు నిచిలిపోయాయి. దాంతో అప్పట్లో స్కూళ్ల భవన నిర్మాణాల కోసం పాఠశాలల ఆవరణలో సిద్ధం చేసిన ఇనుము, కంకర, ఇసుక నిరుపయోగంగా మిలిగిపోగా ఇనుము తుప్పుపట్టింది. కంకర, ఇసుక మట్టిలో కలిసిపోతోంది. దీంతో కోట్లాది రూపాయాల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వం కొత్తగా స్కూళ్ల భవనాలను నిర్మించకపోగా కనీసం గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను సైతం ఏడాది కాలంగా పూర్తిచేయలేకపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


తుప్పుపట్టి నిరుపయోగం మారుతున్న ఇనుము


మట్టిలో కలిసి పోతున్న కంకర

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం


పాలమూరు వసతి గృహంలో బియ్యం నాణ్యత పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

పెనుమంట్ర: ఈనెల 12 నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజనం పెడతారని జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం మండలంలోని పాలమూరు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని, మార్టేరు శ్రీ వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి సన్న బియ్యం స్టాకును పరిశీలించారు. జిల్లాలోని 1423 ప్రభుత్వ పాఠశాలలు, 75 సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సన్న బియ్యం సరఫరా చేశారన్నారు. జిల్లాకు ఎక్కువ శాతం బాపట్ల జిల్లా బియ్యం వచ్చిందన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ పి.శివరాం ప్రసాద్, సాంఘిక సంక్షేమ అధికారి రామాంజనేయ రాజు తదితరులు ఉన్నారు.

532 మంది ఎస్జీటీలకు బదిలీ


ఏలూరులో ఎస్జీటీ బదిలీల కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు బుధవారం బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఉదయం ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన 166 మందికి బదిలీ చేశారు. అనంతరం పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న 266 మందికి స్థానచలనం కల్పించారు. సాయంత్రం నుంచి జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలు 100 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి సీనియారిటీ ప్రాతిపదికన కోరుకున్న చోటుకు బదిలీ చేశారు. కౌన్సిలింగ్ గురువారం కూడా కొనసాగుతుందని విద్యాశాఖాధికారి తెలిపారు.

పుస్తకాల పేరిట వ్యాపారం

ఏలూరు(ఆర్ఆర్‌పేట): విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఏలూరు జిల్లా పెదపాడు మండలం హనుమాన్ జంక్షన్ చైతన్య స్కూల్లో పుస్తకాలు అమ్మకాలు జరుగుతున్నాయని.. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొలిక్కపోగు లెనిన్ అన్నారు. చదువు పేరుని అడ్డుపెట్టుకుని తల్లిదండ్రులపై భారం మోపి దోచుకుంటున్నారని తెలుగు రాష్ట్రాల్లో పుస్తకాల పేరుతోనే కోట్ల రూపాయలు దోపిడీ చేస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ అధికారులు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు.

క్లుప్తంగా

అంజన్న సన్నిధిలో...



మద్ది క్షేత్రంలో సినీ ప్రముఖులకు వేదాశీర్వాదం అందజేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రాన్ని సినీ ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. దర్శకుడు శ్రీరామ్ వేణు (వకీల్ సాబ్), ఫొటోగ్రాఫర్ గుహన్ (అతడు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు), ఆదిత్య ఫిల్మ్స్ డిస్ట్రిబ్యూటర్స్ నుంచి ఎల్.వెంకటేశ్వరరావు, రాంబాబు మద్ది ఆంజనేయస్వామి వారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయ మండపం వద్ద వేదపండితులు వారికి వేద ఆశీర్వచనం చేశారు. సినీ ప్రముఖులతోపాటు అభిమానులు పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్వీ చందన తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భీమవరం: భీమవరం పట్టణంలో గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో బుధవారం అన్నపూర్ణ థియేటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో ఉండగా స్థానికులు గుర్తించి అంబులెన్స్‌కు సమాచారం అందించి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడు. ఆచూకీ తెలిస్తే భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఫస్ట్ ప్లేస్‌లో ఆర్టీసీ భీమవరం డిపో



డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఆర్టీసీ డిపో అత్యధిక కేఎంపీఎల్ సాధించి మొదటి స్థానంలో నిలిచింది. 2024 -2025 సంవత్సరానికి రాష్ట్రంలో 129 ఆర్టీసీ డిపోల్లో అత్యధిక కేఎంపీఎల్‌ను భీమవరం డిపో సాధించిందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్.వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పీఎస్వీఎం.సత్యనారాయణ మూర్తిని అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు.

17న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 17వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు చేపట్టనున్నామని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ త్రిసభ్య కమిటీ సభ్యుడు ఆర్ఎస్ఆర్ త్రిమూర్తి, ఈ అశోక్ కుమార్‌గౌడ్, ఎస్‌కె షాకీర్‌హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమౌతాయని వెల్లడించారు. సెప్టెంబర్ 1, 2009 తర్వాత పుట్టిన బాలురు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. జట్టుకు ఎంపికైన వారు జూలై 3 నుంచి 13వ తేదీ వరకూ మంగళగిరిలో జరగబోయే సెంట్రల్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. వివరాలకు 90002 44892 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పూడికతీత.. ఏదీ పనుల్లో నాణ్యత?

- హడావుడిగా గోదావరి కాలువ పూడిక తీత పనులు
- నిబంధనలను పాటించని వైనం
- ప్రశ్నార్థకంగా 35 వేల ఎకరాల సాగు
- సాగునీటి కష్టాలు తప్పవంటున్న రైతన్నలు



గుండుగొలను వద్ద జేసీబీతో గోదావరి కాల్వలో పూడిక తొలగింపు పనులు



పనులు చేసిన తర్వాత నీటిలో కలిసిన కర్రనాచు, గుర్రపు డెక్క

సాక్షి టాస్క్‌ఫోర్స్: శివారు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన గోదావరి కాల్వ పూడిక తీత పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో తమకు సాగునీటి కష్టాలు తప్పవేమోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గోదావరి కాల్వలో పూడిక తీత పనులు చేస్తున్నారా లేక గుర్రపు డెక్క, కర్ర నాచు తొలగింపు పనులు చేపడుతున్నారో అర్థం కాని పరిస్థితి. గుండుగొలను డీసీ పరిధిలో పూళ్ల నుంచి గుండుగొలను వరకు పూడికతీత పనులు జరుగుతున్నాయి. కర్ర నాచు వల్లే గోదావరి కాల్వ నీరు శివారు ప్రాంతాలకు చేరడం లేదని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు ఆ కర్ర నాచు ఎదగకుండా పనులు చేస్తున్నారు. వాస్తవానికి కర్రనాచును నాశనం చేసేందుకు రసాయనాలను స్ప్రే వాడాలి. అయితే సంబంధిత అధికారులు మాత్రం అలా కాకుండా కాల్వలోని కర్రనాచును జేబీసీలతో తీసి కాల్వ గట్టుపై వేస్తున్నారు. వర్షం వస్తే గట్టుపై వేసిన మట్టి మళ్లీ కాల్వలో జారిపడుతుందని, మరలా కర్రనాచు పెరిగి ప్రయోజనం శూన్యమని అంటున్నారు. దీనితో లక్షలాది రూపాయలు ప్రజాధనం నీటిలో పోసినట్లేనని పెదవి విరిస్తున్నారు. కాల్వలో కొన్ని చోట్ల పనులు జరుగుతుండగానే కాల్వకు నీటిని విడుదల చేయడంతో పనుల్లో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని 35 వేల ఎకరాల్లోని వరి పంట సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. దాళ్వాలో గోదావరి కాల్వ శివారు రైతాంగానికి సాగునీరు అందక ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో గోదావరి కాల్వకు పూడిక తీత పనులు జరిగాయి. సాగునీటికి గత ఐదేళ్ల కాలంలో ఎన్నడూ రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడిన పరిస్థితులు రాలేదు. దీనితో పాటు దాళ్వాలో రైతులకు సీలేరు జలాలను తీసుకుని వచ్చి రైతులకు సాగునీటికి అందించింది. కానీ కూటమి ప్రభుత్వం దాళ్వాలో రైతులు నీటి కోసం రాత్రిళ్లు జాగారాలు చేశారు.

హడావుడి పనులు.. నాణ్యతపై అనుమానాలు

దాళ్వాలో రైతులు పడ్డ కష్టాలను చూసిన ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఈ పనులను కాల్వ మూసివేసిన ఏప్రిల్ నెలాఖరు నుంచే చేపట్టాల్సి ఉంది. అధికారులు ముందస్తు ప్రణాళికలు తయారు చేయకపోవడంతో మే నెలాఖరున ఈ పనులు చేపట్టారు. దీనితో పనులు అలస్యమయ్యాయి. హడావుడిగా ఈ పనులు చేపట్టడంతో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చివరి దశలో పనులు జరుగుతుండగానే గోదావరి కాల్వ వెంబడి గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తడంతో కాల్వలోకి నీటిని విడుదల చేశారు. దీనితో కొన్ని చోట్ల పనులు నిలిచిపోయాయి. ఏడాదంతా డీసీ పరిధిలోని సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గుర్రపుడెక్క, కర్రనాచులను తొలగించేందుకు వెచ్చించాల్సిన లక్షలాది రూపాయలను ఈ పనుల కోసం నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారని వాపోతున్నారు. దాళ్వాలో సాగునీటి కష్టాలు తప్పవన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గంజాయి తరలిస్తూ పట్టుబడిన యువకుడు



స్వాధీనం చేసుకున్న గంజాయి

కుక్కునూరు: గంజాయి తరలిస్తూ ఓ యువకుడు జాలర్లకు పట్టుబడ్డాడు. వివరాల ప్రకారం కూనవరం మండలం పోలిపాక గోదావరి రేవు నుంచి గోదావరి దాటితే కుక్కునూరు మండలంలోని వింజరం గ్రామానికి చేరుకోవచ్చు. ఈ రేవు గుండా పలువురు కుక్కునూరు, కూనవరం మండలాలకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. బుధవారం ఓ యువకుడు వింజరం రేవుకు వెళ్లేందుకు పోలిపాక రేవుకు చేరుకున్నాడు. జాలర్లకు అనుమానం వచ్చి ఆ యువకుడి బ్యాగ్‌ని తనిఖీ చేయగా అతని వద్ద గంజాయి లభించింది. దీంతో జాలర్లు ఆ యువకుడిని పట్టుకుని వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో విషయం బహిర్గతమైంది. ఈ విషయమై అక్కడి పోలీసులకు సమాచారం అందడంతో యువకుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. కాగా గత మూడు నెలల క్రితం కూడా పోలిపాక రేవు నుంచి వింజరం రేవు మీదుగా తెలంగాణకు గంజాయి తరలిస్తుండగా తెలంగాణ పోలీసులు బూర్గంపాడు వద్ద పట్టుకున్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మణ్ మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు యూనిఫామ్, పుస్తకాలు, ఇతర సామాగ్రి పాఠశాలలోనే కొనాలని ఒత్తిడి చేస్తూ అసలు ధర కన్నా రెండు నుంచి మూడు రెట్లు అధికంగా విక్రయిస్తూ తల్లిదండ్రుల జేబులు గుల్ల చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఫిర్యాదు మేరకు ఎంఈఓ జ్యోతి ప్రైవేట్ పాఠశాల పుస్తకాల గదిని సీజ్ చేశారు. తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఎస్ఎఫ్ఐ సభ్యులు ఆందోళన విరమించారు. ఆందోళనలో పట్టణ నాయకులు నాగేంద్రబాబు, టి.రవిబాబు, మణికంఠ, గణేష్, సింధు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల ప్రోద్బలంతో కేసు నమోదు

నరసాపురం రూరల్: అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్, తీర ప్రాంత నాయకుడు తిరుమాని నాగరాజుపై బుధవారం కేసు నమోదైంది. వేములదీవి వెస్ట్ సర్దుకొడపలో వాడకం చెరువుకు ఫెన్సింగ్ వేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్ విధులకు ఆటంకం కలిగించారంటూ నాగరాజుపై కేసు నమోదు చేశారు. అయితే వాస్తవానికి ఆ ప్రాంతంలో చెరువుకు ఫెన్సింగ్ అవసరం లేకపోయినా కూటమి నేతల ప్రోద్బలంతో వైఎస్సార్ విగ్రహం వద్దకు ఎవ్వరినీ వెళ్లనీయకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఫెన్సింగ్ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగరాజు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో జరిగిన వాగ్వివాదాన్ని సాకుగా చూపుతూ కూటమి నేతలు ఏఈ లోకేష్‌తో నాగరాజుపై ఫిర్యాదు చేయించారు. నరసాపురం రూరల్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి వెంకట సురేష్ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు


టి.నరసాపురం: వివాహిత ఫిర్యాదు మేరకు అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. మండలంలోని తిరుపతిపాడకు చెందిన పోతన శివరామకృష్ణతో నాగదేవికి వివాహం కాగా, వివాహ సమయంలో రూ.8 లక్షలు కట్నం ఇచ్చారు. కొంతకాలం కాపురం సజావుగానే సాగినా అనంతరం అధిక కట్నం కోసం నాగదేవిని వేధించడం మొదలు పెట్టారు. భర్త, మరో ఆరుగురు కుటుంబసభ్యులతో కలిసి శారీరికంగా, మానసికంగా తనను వేధించారని, ప్రస్తుతం ఇంట్లో నుంచి గెంటివేశారని, తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆక్వా ఉక్కిరిబిక్కిరి

- వాతావరణ మార్పులతో ఆక్వా రంగం కుదేలు
- వైరస్‌ల బారిన చేపలు, రొయ్యలు
- ఆందోళనలో ఆక్వా రైతులు



గూట్లపాడులో రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు



రొయ్యల చెరువులో తిప్పుతున్న ఇంజిన్ బోట్లు

భీమవరం అర్బన్: గత నెల రోజులుగా వాతావరణంలో విపరీతమైన మార్పులు కనిపిస్తుండడంతో ఆక్వా రంగం ఉక్కిరిబిక్కిరవుతోంది. ఒకవైపు అధిక ఉష్ణోగ్రతలు, మరోవైపు వర్షాలు పడడంతో చేపలు, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ శాతాల్లో మార్పులు తలెత్తుతున్నాయి. దీంతో చేపలు, రొయ్యలు వైరస్‌ల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. భీమవరం మండలంలో నాగిడిపాలెం, దొంగపిండి, కొత్తపూసలమర్రు, అనాకోడేరు, కొమరాడ, వెంప, పెదగరువు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, లోసరి తదితర గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో చేపలు, సుమారు 7 వేల ఎకరాల్లో వనామీ రొయ్యల పెంపకం సాగిస్తున్నారు. గత నెల రోజులకుపైగా వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలు పడటంతో శీలావతి, కట్ల, రూప్ చంద్, గడ్డి చేప, ఫంగస్ తదితర సప్పనీటి చేపలకు రాత్రుళ్లు ఆక్సిజన్ శాతాల్లో హెచ్చుతగ్గులు ఏర్పడి తాటాకు తెగులు, శంకు జలగ, రెడ్ డీసీజ్, పేను కొరుకుడు వంటి వ్యాధులు సోకుతున్నాయని, దీంతో ఉదయం పూట చెరువు ఉపరితలంపై చేపలు అసహనంగా ఈదుతూ మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని నివారించేందుకు రాత్రులంతా ఇంజిన్ బోట్లతో తిప్పాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలరోజుల క్రితం పంటకాలువలు కట్టేయడంతో చెరువుల్లో నీళ్లు తోడేందుకు సైతం ఆస్కారం లేదని చెరువుల వద్దే పడిగాపులు కాస్తున్నామని చేప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైరస్ దాడికి రొయ్యలు మృత్యువాత

వాతావరణంలో ఉష్ణోగ్రతలు స్థిరంగా లేకపోవడంతో చెరువుల్లోని నీటి పరమాణువులైన పీహెచ్, అమ్మోనియా, నైట్రోజన్, ఆక్సిజన్ శాతంలలో హెచ్చుతగ్గులు ఏర్పడి వైట్ స్పాట్, విబ్రియో, వైట్‌గట్, తదితర వైరస్‌లు వ్యాప్తిచెంది రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ వైరస్‌ల వల్ల 30 రోజులలోపే రొయ్యలు చనిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతలేని సీడ్‌తో ఇబ్బందులు

నాణ్యత ఉన్న వనామీ సీడ్‌కు వైరస్‌ల ప్రభావం తక్కువగా ఉటుంది. కొన్ని రొయ్య పిల్ల ఉత్పత్తి కేంద్రాలు వనామీ పిల్లలు ఉత్పత్తి చేయడంతో రొయ్యపిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువై కొద్దిపాటి వాతావరణ మార్పులకే వైరస్ బారిన పడి మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. అలాగే నాణ్యత, నాణ్యతలేని సీడ్ తెలుసుకోవడానికి పీసీఆర్ పరీక్ష ద్వారా ఈహెచ్‌పీ, విబ్రియో, వైట్ స్పాట్ పరీక్షలు చేస్తేనేగానే తెలియదు. నాణ్యమైన సీడ్ ఉత్పత్తి చేస్తే రొయ్యలు పట్టుబడికి వస్తాయి. దీంతో రైతుకు పెట్టుబడుపోను కొంతైనా మిగిలితే మళ్లీ వనామీ రొయ్యల పెంపకం సాగిస్తాడు.

> **ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**
>
> ఎకరం చెరువులో నాణ్యతలేని సీడ్ వేస్తే రొయ్యలకు వైరస్ వచ్చి నెల రోజుల వ్యవధిలోనే రూ.లక్షకు పైగా రైతు నష్టపోతున్నాడు. ఫీడ్ ధరలు పెరిగిపోయాయి. రొయ్య ధరలు తగ్గిపోతున్నాయి. మా తీర ప్రాంత గ్రామాల రైతులంతా రొయ్యల పెంపకంపైనే ఆధారపడుతున్నాం. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం స్పందించాలి.
>
> – వాటాల విజయ్ కుమార్, రొయ్య రైతు, నాగేంద్రపురం

ఏడాదైనా సూపర్ సిక్స్ వాయిదాలేనా?

నూజివీడు: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పాలన అంటూ జగన్ ఫోబియాలో కొట్టుకుపోతోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని నమ్మబలికిన విజన్ సృష్టికర్త రాష్ట్రానికి ఏ ఒక్క కొత్త పరిశ్రమని తీసుకురాలేకపోగా అప్పుల ఊబిలోకి నెట్టివేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితిలో ఉందన్నారు. పారిశ్రామిక వేత్తలకు భూములు దారాదత్తం చేయటానికి గతంలో భూ బ్యాంకులకు రూపకల్పన చేసిన చంద్రబాబు రాజధానికి మరో 45 వేల ఎకరాలు సేకరించేందుకు సిద్ధమవుతున్నారన్నారు. గతంలో సేకరించిన రాజధాని భూముల్లో ఎటువంటి అభివృద్ధి లేక, తుమ్మలు నరకటానికి రూ.40 కోట్లు ప్రజాధనం దుర్వినియోగమైందని హరినాథ్ ఆక్షేపించారు. హరితాంధ్ర ప్రదేశ్ రుణాంధ్రప్రదేశ్‌గా మారనుందని విమర్శించారు.

ఇన్‌స్టాలో పరిచయం.. ఫొటోల మార్ఫింగ్‌తో వేధింపులు

భీమవరం: ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టి నగదు డిమాండ్ చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని భీమవరం పట్టణానికి చెందిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతికి, అబ్దుల్ సమీర్ అనే వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యాడు. మే 12న భీమవరం వచ్చానని సమాచారం ఇవ్వగా పట్టణంలోని ఓ చోట కలుసుకున్నారు. వారిద్దరూ కలిసిన సన్నివేశాలను రహస్యంగా రికార్డు చేశాడు. వాటిని బాధితురాలి వాట్సాప్‌కు ఇటీవల పంపించాడు. శారీరక సంబంధాలు పెట్టుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. నగదు డిమాండ్ చేయడంతో పాటు తన తల్లిదండ్రులను బహిరంగంగా అవమానానికి గురిచేస్తానని బెదిరించాడు. దీనిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో సీఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామపై అల్లుడి దాడి

ముదినేపల్లి రూరల్: మామపై అల్లుడు కత్తితో దాడి చేసి గాయపరచిన ఘటన మండలంలోని కోడూరులో మంగళవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం కోడూరుకు చెందిన బత్తిన నాగరాజు కుమార్తె సాధ్వినీ చిగురుకోట శివారు నరసన్నపాలెంకు చెందిన ఘంటా సతీష్‌కుమార్‌కు ఇచ్చి ఏడాది కిందట వివాహం చేశారు. వీరికి ఒక పాప పుట్టింది. సాధ్వినీకి అత్తకు ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండడంతో ఆమె పది రోజుల కిందట పుట్టింటికి వచ్చింది. ఈ నేపథ్యంలో సతీష్ ప్రతిరోజూ అత్తవారింటికి వచ్చి తన పాపను ఇవ్వమని అడుగుతున్నాడు. మంగళవారం సాయంత్రం మరలా అత్తారింటికి వెళ్లి తన కుమార్తెను ఇవ్వమని అడగ్గా భార్యభర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఘర్షణ నివారించేందుకు అడ్డు వెళ్లిన మామ నాగరాజుపై సతీష్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. చికిత్స నిమిత్తం నాగరాజును గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్మశాన స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

పాలకోడేరు: శ్మశాన స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన తగాదాలో పంచాయతీ వార్డ్ సభ్యురాలు గాయపడిన ఘటన ఇది. వివరాల ప్రకారం శృంగవృక్షం గ్రామంలోని చినపేటలో రికార్డుల ప్రకారం కొంత శ్మశానం స్థలం ఉంది. అయితే ప్రస్తుతం సదరు స్థలాన్ని శ్మశానానికి ఉపయోగించడం లేదు. దాంతో ఒక వర్గం వారు ఆ స్థలాన్ని వేరే ప్రయోజనాలకు ఉపయోగించాలని సంకల్పించారు. దీన్ని రెండో వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఒక వ్యక్తి చనిపోగా వివాదాస్పద స్థలంలో ఖననం చేయడానికి కొందరు సమాయత్తమవ్వగా మరికొందరు వ్యతిరేకించారు. దీంతో రెండు వర్గాలు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో వార్డు సభ్యురాలు కోరుకొల్లు స్రవంతిపై పిల్లి సుదర్శన్, మరి కొందరు దాడి చేయగా, ఆమె తలకు తీవ్ర గాయం అవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. నిందితులపై కేసు నమోదు చేయాలని పెద్ద ఎత్తున దళిత యువకులు పాలకోడేరు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. దీనిపై సుదర్శన్‌తో పాటు మరో ఏడుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

ముగిసిన వరాల వెంకన్న కల్యాణోత్సవాలు



విశేష అలంకరణలో శ్రీవరాల వేంకటేశ్వరస్వామి



స్వామివారి పవళింపు సేవలో పాల్గొన్న భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలు శ్రీపుష్పయాగోత్సవంతో బుధవారం ముగిశాయి. గ్రామానికి చెందిన పెరికల పాండురంగ, అనంతలక్ష్మి దంపతులచే స్వామివారిని 200 మూరల మల్లెపూలతో విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మంతెన సీతారామరాజు, కొట్టు పరశురామయ్య పర్యవేక్షణలో అల్లరి పళ్లెం డ్రా తీశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆకుల వెంకటనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

భీమవరం: మైనర్ బాలికను ప్రేమించి వివాహం చేసుకుని తల్లి అయిన తర్వాత తప్పించుకుని వెళ్లిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన ఇది. భీమవరం రెండో పట్టణంలోని ఒడిశాకు చెందిన ఓ బాలిక ఇంటి నుంచి వచ్చి భీమవరంలోని ఓ హోటల్లో పనికి చేరింది. అక్కడ అస్సాంకు చెందిన వ్యక్తితో పరిచయం కాస్తా పెళ్లి వరకు వెళ్లింది. గర్భం దాల్చడంతో విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంటిని తీసుకుని అక్కడ ఉంచాడు. ఇటీవల ఆమెకు పాప పుట్టింది. తన తల్లిదండ్రులను చూసి వస్తానని వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో అక్కడి పోలీసులను ఆశ్రయించగా కృష్ణలంక పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి వివరాలను భీమవరం పోలీసులకు అప్పగించారు. సీఐ జి. కాళీచరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ఆకివీడు: చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డ వృద్ధుడిపై పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి దాడి చేయగా పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం స్థానిక సంతపేటలో చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న వృద్ధుడు షేక్ మీరాపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సత్యవాడ కిరణ్‌కుమార్ అనే యువకుడు దాడి చేశాడు. దీంతో బుధవారం అతడిని ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. కోర్టు అతనికి 14 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు.

క్లుప్తంగా

అనంతమ్మ తల్లికి విశేష పూజలు


విశేష అలంకరణలో అనంతమ్మ తల్లి

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని కె.ఎస్.ఎన్ కాలనీలో వేంచేసియున్న అనంతమ్మ తల్లికి (మహాలక్ష్మీదేవికి) బుధవారం ఏరువాక పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి విశేష హారతులు, అర్చనలు, వివిధ పూలదండలతో విశేషఅలంకరణలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పెదబాబు, చినబాబు, రాజు, జోన్నల సత్యనారాయణ పర్యవేక్షించారు.

వీఆర్‌గూడెంలో ర్యాలీ


వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ రక్తపోటు మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష మాట్లాడుతూ అధిక రక్తపోటు ఉన్న వారు తప్పకుండా మందులు వాడుతూ బీపీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. తినే ఆహారంలో ఉప్పు తక్కువగా ఉండేటట్టు చూసుకోవాలన్నారు. ప్రతి రోజూ కొంత సమయం నడక అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, పీహెచ్‌ఎన్ అన్నమ్మ, హెచ్‌ఎస్ లక్ష్మణ్, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మెగా డీఎస్సీ పరీక్షలు


శ్రీవాసవి సెంటర్‌లో డీఎస్సీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీకు సంబంధించి రాత పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుండగా బుధవారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలో కలిపి మొత్తం 8 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌లో ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షకు 245 మందికిగాను 230 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పరీక్షా నిర్వహణను పర్యవేక్షించారు.

యోగాతో ఒత్తిడి దూరం


యోగా చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పెంటపాడు: నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపసమనం పొందవచ్చని అలంపురం సీహెచ్‌వో కీర్తి, ఎఎన్ఎం కాంతామణిలు తెలిపారు. బుధవారం పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీలు, బాలికల అవగాహన సమావేశాలు, మానవహారాలు నిర్వహించారు. పలు సెంటర్లలలో కిషోరి వికాశం కార్యక్రమాలు జరిగాయి. అలంపురం గ్రామంలో సీహెచ్‌వో కీర్తి, ఎఎన్ఎం కాంతామణిల ఆధ్వర్యంలో యుక్తవయస్సు బాలికలకు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించారు. అవగాహన సమావేశం నిర్వహించారు. యోగా చేయించారు. పోక్సో చట్టంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ నిర్వాహకులు విజయ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామంలోని కిశోర్‌బాలికలు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యవర్గం ఎన్నిక


కళింగ లక్ష్మణరావు


కొణతాల నాగరాజు

పెంటపాడు: మండలంలోని సీపీఐ మండల మహాసభ బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మండల సీపీఐ కార్యదర్శిగా కళింగ లక్ష్మణరావు, సహాయకార్యదర్శిగా కొణతాల నాగరాజులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల సమితి సభ్యులుగా వంకా అప్పారావు, దిద్దే నాగేశ్వరరావు, ఉయ్యూరు సత్యనారాయణ, ఎం. రాజేష్, కె. లక్ష్మణరావు, తాడిపర్తి గంగ, ముమ్మిడివరపు వెంకటలక్ష్మిలను ఎన్నుకొన్నారు. నూతనంగా ఎన్నికైన వారిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

నాడు ఆదర్శం.. నేడు అస్తవ్యస్తం

- నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చిన జగనన్న సర్కారు
- బిల్లులు చెల్లించకుండా అసంపూర్తిగా వదిలేసిన కూటమి ప్రభుత్వం
- సంస్కరణల పేరిట విద్యారంగం నిర్వీర్యం
- అమ్మ ఒడి, ఫీజురీయింబర్స్ మెంట్ వంటి పథకాలు అందకపోవడంపై మండిపాటు


తాడేపల్లిగూడెంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు

తాడేపల్లిగూడెం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలలను ఎంతగానో బలోపేతం చేసింది. నాడు–నేడు పథకంలో పాఠశాలల స్వరూపాన్ని సమూలంగా మార్చింది. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించింది. తరగతి గదులు, ప్రహరీ, ఫర్నిచర్ ఇలా ప్రతి అంశంలో మార్పు తీసుకొచ్చింది. విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందించింది. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద బైజూస్ కంటెంట్, డిజిటల్ విద్య అమలు చేసింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. గత ప్రభుత్వంలో మొదలైన నాడు–నేడు పనులను తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పలు పాఠశాలల్లో అసంపూర్తిగా వదిలేశారు. ఈ నిర్మాణాలు పూర్తికాక పాడవుతున్నాయి. గోరుముద్దలో నాణ్యత తగ్గింది. పాఠశాలలు మెర్జ్ చేస్తుండటంతో ఏ ఊరిలో బడి ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అమ్మ ఒడి స్థానంలో తీసుకు వస్తామన్న తల్లికి వందనం ఇంకా అమలు చేయలేదు. మొత్తమ్మీద పాఠశాల నిర్వహణ గాడి తప్పింది.

తాడేపల్లిగూడెం మండలంలో పాఠశాలలు	161
నాడు నేడు ద్వారా ఆధునీకీకరణ చేసినవి	161
నాడు–నేడు కోసం చేసిన ఖర్చు	రూ.32 కోట్ల 67 లక్షలు
పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సంఖ్య	729
విద్యార్థుల సంఖ్య	16931
2018–19లో విద్యార్థుల సంఖ్య	16540
పెరిగిన విద్యార్థుల సంఖ్య	391

- ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు,ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానల్స్(ఐపీఎఫ్) ద్వారా విద్యను బోధిస్తున్నారు.
- బైజూస్ కంటెంట్ విద్యను అందజేసేందుకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.
- స్కూల్‌కు వచ్చే విద్యార్థి కార్పొరేట్ పాఠశాల విద్యార్థికి ఏ మాత్రం తగ్గకుండా, అంతకు మించి సౌకర్యాలను కల్పించారు.
- తల్లులు పిల్లలను బడికి పంపే విధంగా ఆర్థికంగా ఇబ్బంది లేకుండా అమ్మ ఒడి ద్వారా ఏటా 15వేలు ఖాతాల్లో జమ చేశారు.

ఇవి గుర్తులుగానే మిగిలాయా?

ఎగబడి ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో మాదిరిగా చేరడంలేదు. మా పాఠశాలలో సీట్లు అయ్యిపోయాయని గతంలో ఫ్లెక్సీలు వెలిసేవి. ప్రస్తుతం పాఠశాలలు చాలా వరకు బోసిగా కనిపిస్తున్నాయి. విద్యార్థుల దామాషాలో ఉపాధ్యాయులు లేరనే అపప్రద ఉంది. ఇంగ్లీష్ మీడియం చదువు ఎండమావిలా ఉంది. భోజనంలో నాణ్యతపై విమర్శలు వస్తున్నాయి. నాడు ఘనం నేడు ఏమనం అనే విధంగా పాఠశాలలు మారిన వాతావరణం ఉంది.


పరుచుకున్న పచ్చదనం



పరిశుభ్రమైన మరుగుదొడ్లు


విద్యార్థులకు పౌష్టికాహారం (ఫైల్)

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్సై పి ప్రేమరాజు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి గ్రామానికి చెందిన చిట్టిఅప్పారావుతో కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన సాయిదీపికతో ఈఏడాది ఫిబ్రవరిలో వివాహం అయింది. అప్పారావు తణుకులో జొమోటోలో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడని, పది రోజుల క్రితం భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగిందని, దానిని పెద్దల సమక్షంలో పరిష్కరించుకున్నారని చెప్పారు. ఈనెల 9న భార్యను అత్తిలి గ్రామానికి తీసుకువచ్చాడని, ఈనెల 11న అప్పారావు డ్యూటీ నిమిత్తం తణుకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో భార్య సాయి దీపిక ఇంటి నుండి బయటకు వెళ్లిపోయిందని, పరిసర ప్రాంతాలలో వెతికినా ఆచూకి లభించక పోవడంతో భర్త అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు చెప్పారు.

గిరిజన విద్యార్థిని హత్య దారుణం

భీమవరం: గిరిజన విద్యార్థిని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ అనంతపురం పట్టణానికి చెందిన విద్యార్థిని తన్మయిని కిరాతంగా హత్యచేయడం దారుణమన్నారు. గత ఏడాది కాలంగా ఎస్సీ, ఎస్టీ మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తక్షణం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టెం శుభాకర్, గెడ్డం జార్జ్, అంబటి ఆనంద్‌కుమార్, బి సతీష్, ఎస్ మోజేస్, ఎస్ మహేష్, పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార నియమాలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్ : అధిక రక్తపోటు నివారణకు మంచి ఆహార అలవాట్లను పాటించాలని అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. తణుకు ఎన్జీవో కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం రక్తపోటు, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా అధికంగా బరువు పెరగకుండా చూసుకోవాలని, ఉప్పు వినియోగం వినియోగం బాగా తగ్గించాలని, మద్యం సేవించరాదని, పొగ తాగరాదని చెప్పారు. శారీరక శ్రమ తప్పనిసరి చేసుకోవాలని, వంట నూనెలు చాలా తక్కువ మోతాదులో వాడాలని, ఆహారంలో ఎక్కువ కాయగూరలు, పండ్లు తీసుకోవాలని, క్రమం తప్పకుండా రక్త పోటు పరీక్ష తప్పనిసరి అని వివరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలంలో కీటక జనిత, నీటి జనిత వ్యాధులకు ఆస్కారం ఎక్కువని, దోమకాటు వ్యాధులైన మలేరియా, చికెన్‌గున్యా వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే దోమ పుట్టుకకు చెక్ పెట్టే ఫ్రైడే డ్రైడే పాటించడం ముఖ్యమన్నారు. అతిసారం, టైఫాయిడ్, కామెర్లు వ్యాధుల బారిన పడకుండా చేతుల శుభ్రత పాటించడం, కాచి చల్లార్చిన నీటిని త్రాగడం, ఈగలు వాలకుండా ఆహార పదార్థాలున్న పాత్రలపై విధిగా మూతలు ఉంచాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీలు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఆటల దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీటీసీ): శారీరక, మానసిక పెరుగుదలకు ఆటలు ఎంతో అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక వీకర్స్‌కాలనీ యర్రనారాయణ స్వామి స్కూల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ప్రీ స్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ ఆటల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రథమ్ ఆర్గనైజేషన్ స్టేట్ కోఆర్డినేటర్ చిన్నబాబు, జిల్లా కోఆర్డినేటర్ చిన్నబాబు, జిల్లా కోఆర్డినేటర్ వెంకట్‌లు పర్యవేక్షించారు. ఎడ్యూకేషన్ ఆవశ్యకతను వివరిస్తు వివిధ గేయాలు, పాటలు పాడారు. ఎంఈఓ పీఎంకే జ్యోతి, ఐసీడీఎస్ సీడీపీఓ టి.లక్ష్మీసరస్వతిలు మాట్లాడుతూ పిల్లలు ఆటలు ఆడటం ద్వారా శరీరక పెరుగుదల, మానసిక స్థైర్యం లభిస్తుందని చెప్పారు.

ఎన్నికల్లో సత్తా చూపాలి


కార్మికులతో మాట్లాడుతున్న గోపాలన్

పెంటపాడు: ఈనెల 13న ప్రత్తిపాడు త్రిపుల్‌ఎఫ్ కర్మాగార యూనియన్ ఎన్నికలలో స్టార్‌గుర్తుకు ఓటు వేసి తప్పక గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు త్రిపుల్ కర్మాగార యూనియన్ ఎన్నికలు సందర్భంగా బుధవారం తాడిపర్తి గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను, చట్టాలను కించపరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిరపరపు రంగారావు, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండరామిరెడ్డి, బంకూరు నాగేశ్వరరావు, చిటికెన రాము, నరమాల కృష్ణ, గొర్రెల సతీష్‌కుమార్, దేశం శెట్టి సతీష్ కుంచంగి నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

మంచిలిలో సీసీ రోడ్డు ప్రారంభం

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మించి అభివృద్ధి చేస్తున్నామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో రూ. 12.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి శామ్యూల్, తహసీల్దార్ దశికవంశీ, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఏపీలో కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంగా ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను గాలికి వదిలివేసి, ప్రజలను పెడదోవ పట్టించే విధంగా రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన కొనసాగిస్తుందని వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు ఎస్కె నౌషాద్ మోహిద్దీన్ విమర్శించారు. పార్టీ కార్యకర్తలపై, నాయకులపై, మాజీ ఎమ్మెల్యేలపై, పాత్రికేయులపై ఎదో ఒక కేసు పెట్టి జైలుకు పంపించడమే కాకుండా, అప్పుడు పనిచేసిన ఉన్నతాధికారులపై కూడా అక్రమంగా కేసులు పెట్టి వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటనను హరించే విధంగా రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పత్రిక కార్యాలయాలపై దాడులు, అక్రమ కేసులు పెట్టి ప్రజాస్వామ్యాన్ని మంట కలిపే విధంగా ఆరాచక పాలన సాగిస్తున్నారని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక ప్రజల మైండ్ సెట్‌ను డైవర్ట్ చేయడానికి ఈ రకమైన చర్యలు చేపట్టడం శోచనీయమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు.

గాలిలో కలిసిన ప్లాస్టిక్ నిషేధం

- టాస్క్‌ఫోర్స్ ఏమైంది?
- మొదటిలో హడావిడి
- తరువాత కానరాని నిషేధం


ప్లాస్టిక్ కవర్లు


ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరలు


డ్రైయిన్‌లలో రోజువారి పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): మానవ జీవన శైలికి హాని చేస్తున్న పాలిథిన్ సంచుల వినియోగం తాడేపల్లిగూడెం పట్టణంలో తిరిగి తారస్థాయికి చేరుకుంది. నిషేధం కాస్త అటకెక్కింది. ప్లాస్టిక్‌ను నిషేధిస్తాం..క్యారీ బ్యాగ్‌లు వాడితే కఠినమైన చర్యలు..నిబంధనలు పాటించని వారిపై జరిమాన్లు విధించడం, అనంతరం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు అయింది. ఇక అనుమతి లేని ప్లాస్టిక్ పట్టణంలో కానరాదు అంటూ మొదటిలో హడావిడి చేసిన మునిసిపల్ అధికారులు ఒక్కసారిగా ఇటీవల కాలంలో మిన్నకుండటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

నిషేధిత ప్లాస్టిక్ వాడరాదు అంటూ మునిసిపల్ అధికారులు పట్టణంలో విస్తృత ప్రచారం చేశారు. కమీషనర్, హెల్త్ ఆఫీసర్, శానిటరీ ఇనస్పెక్టర్లు, సచివాలయం సెక్రటరీలు టీంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది టీంలుగా వెళ్లి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఫైన్‌లు వసూలు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బండిల్స్, క్యారీ బ్యాగ్‌లు, ప్లాస్టిక్ గ్లాసులు, పాలిథిన్ సంచులు, టీ గ్లాసులను షాపులు వద్ద నుంచి బలవంతంగా తీసుకువచ్చి పురపాలక సంఘానికి అప్పజెప్పారు.

నిషేధం అమలు అవుతుంది

టీ తాగే ప్రతిచోట తప్పనిసరిగా గాజు గ్లాసులు వాడేలా చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ గ్లాసులను మానివేశారు. క్యారీ బ్యాగ్‌లు స్థానంలో ఒకొక్కరు చేతి సంచులు, లేని పక్షంలో ప్రజలకు హాని చేయని బయోడిగ్రేడబుల్ (ప్రత్యామ్నాయ) క్యారీ బ్యాగ్‌లు రావడం ప్రారంభమయ్యాయి. మెల్ల మెల్లగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేసే విధంగా చర్యలు చేపట్టారు. అంతా బాగానే ఉందని అనుకున్న సమయంలో ఒకసారిగా అధికారులు తనిఖీలు ఆపివేశారు.

ఏమైందో ఏమో

ఏమైందో ఏమో ఒక్కసారిగా అధికార యంత్రాంగం తనిఖీలు నిలిపివేసింది. మార్పు అనివార్యం అనుకున్న సమయంలో నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో యంత్రాంగం విఫలమైంది. టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు మానివేశారు. కొన్ని రోజులపాటు సక్రమంగా సాగిన ప్లాస్టిక్ నిషేధం, తిరిగి నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, క్యారీ బ్యాంగ్‌లు వినియోగం పుంజుకుంది. బయో డిగ్రేడ్‌బుల్ ఖర్చుతో కూడుకున్నది కావడంతో అన్ని షాపులు వద్ద తిరిగి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఇచ్చేస్తున్నారు.

వినియోగం బాగా పెరిగింది

పట్టణంలో హోటల్స్‌లో, కర్రి పాయింట్స్, పాల స్టోర్స్, కూరగాయల షాపులు, టిఫెన్ సెంటర్లు, తోపుడు బండ్లు, ఆకు కూరలు, కిరణా షాపులు, బియ్యం షాపులు, చేపల మార్కెట్, మాంసం విక్రయ కేంద్రాలలో ఒకటి అని లేదు అన్ని నిత్యావసర వస్తువులు విక్రయించే ప్లేస్‌లలోను సింగిల్ యూజ్ క్యారీ బ్యాగ్‌లు, ప్లాస్టిక్ చిన్న సంచులు, ప్లాస్టిక్ పేపర్లు వినియోగం విచ్చలవిడిగా జరగడం పలు అనుమానాలకు తావు ఇస్తుంది.

అమలు చేయాల్సినవారే ఆచరించడంలేదు

అమలు చేయాల్సిన వారే ఆచరించకపోవడం ఆందోళనకరంగా మారింది. మునిసిపల్ సిబ్బంది, కార్మికులు సైతం అక్కడక్కడ నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులలో టీలు తాగడం, నిషేధిత క్యారీ బ్యాగ్‌లలో అల్పాహారాలు, వేడి కర్రిలు, వేడి అన్నం, వేడి సాంబారులను సైతం తీసుకువెళ్లడం విస్మయానికి గురి చేస్తుంది.

ప్లాస్టిక్ నిషేధాన్ని తుంగలోకి తొక్కారు

ప్రారంభంలో దాడులు నిర్వహించిన ప్పుడు ప్రతాపం చూపిన అధికారులు హోల్ సేల్ వ్యాపారులపై మాత్రం దాడులు తూతూ మంత్రంగా నిర్వహించడం, ప్లాస్టిక్ నిషేధాన్ని తుంగలోకి తొక్కారు. హోల్‌సేల్ వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తీసుకురాకుండా ఉంటే తాము ప్రత్యామ్నాయాలను చూసుకుంటామని చిరు వ్యాపారులు, ప్రజలు చెబుతున్నారు. కొంత మంది వ్యాపారులు స్వచ్ఛందంగా క్యారీ బ్యాగ్‌లను వాడటం మానివేశారు. అయితే తిరిగి కొంత మంది ఇతర వ్యాపారులు ఉపయోగించడం, ముఖ్యంగా కర్రి పాయింట్లు, బియ్యం వ్యాపారులు, టిఫిన్ సెంటర్లు, పాల వ్యాపారులు, మాంసం, చేపలు దుకాణాదారులు ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించడంతో ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపివేసిన ఇతర వ్యాపారులకు వినియోగదారులు దగ్గర నుంచి సానుకూల మద్దతు లభించకపోవడంతో వ్యాపారాలు వారికి తగ్గాయి. దీంతో తప్పని సరి పరిస్థితులలో తిరిగి క్యారీ బ్యాగ్‌లను వినియోగించాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకుని ప్లాస్టిక్ సంపూర్ణ నిషేధాన్ని అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, ఇతర ప్లాస్టిక్ సంచులు, టీ గ్లాసులు ప్రజలకు ఇవ్వరాదు. ప్రస్తుతం టీ స్టాల్‌లో గాజు గ్లాసులు వాడుతున్నారు. టాస్క్‌ఫోర్సు బృందం తనిఖీలు చేస్తుంది. నిరంతర ప్రక్రియ. బయోడిగ్రేడ్‌బుల్ కవర్లు మాత్రమే అందించాలి. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

– రవి సుధాకర్, మునిసిపల్ మేనేజర్, తాడేపల్లిగూడెం

ప్లాస్టిక్ కవర్లు వినియోగం తగ్గించాలి



మానవ జీవన శైలికి హాని చేస్తున్న నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగం పట్టణంలో తగ్గించే విధంగా అధికారులు కృషి చేయాలి. వ్యాపారస్తులు అందరూ ప్రజలందరికి డిగ్రేడ్‌బుల్ కవర్లు మాత్రమే అందించే విధంగా చూడాలి. ఆ దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేయాలి.

– ఎస్‌కె నౌషాద్ మొహిద్దీన్, సామాజిక కార్యకర్త